# చైతన్య గళం

తెలుగు దిన పత్రిక








సంచిక :199 సంపుటి : 1 హైదరాబాద్ , రంగారెడ్డి, నాగర్ కర్నూల్ , మహబూబ్‌నగర్ గురువారం 22 -8 -2024 వెల : .రూ. 5.00




## ఆదానీకి దాసోహమన్న మోడీ ప్రభుత్వం

**ఆదానీకి అనుకూలంగా ప్రభుత్వ నిర్ణయాలు**

**ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్న మోడీ**

**నిరసనగా 22న కాంగ్రెస్ ఆందోళనలు: మధుయాష్కీ**

21,ఆగష్టు (చైతన్యగళం –హైదరాబాద్,

ఆదానీ మోడీ బంధానికి నిరసనగా కాంగ్రెస్ నేడు ధర్నాలకు పిలుపునిచ్చింది. వ్యాపారస్తుల మద్దతుతో మోడీ అధికారంలోకి వచ్చారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మధుయాష్కీ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్ట్ 22న ఈడీ కార్యాలయాల వద్ద కాంగ్రెస్ ఆందోళన చేయాలని నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వ సంస్థలను ఆదానీకి పనికొచ్చే విధంగా మార్పు చేశారని విమర్శించారు. ఎన్డీటీవీ, అంబుజా సిమెంట్, జీవీకే గ్రూప్స్‌పై ఈడి దాడి చేస్తే..

-మిగతా 2 లో



## పారదర్శకంగా... వేగంగా భూసేకరణ



**ఏరోజుకారోజు... వివరాలు అందించాలి**

- దక్షిణ ప్రాంతంలో భూసేకరణకు దిగాలి
- ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్లు తదితర పనులపై ఆరా
- ట్రిపుల్ ఆర్‌పై సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు

21,ఆగష్టు (చైతన్యగళం హైదరాబాద్,

రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం భూసేకరణను పారదర్శకంగా, వేగంగా చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నారు.. పనుల పురోగతి ఏంటనే దానిపై రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారం తనకు అందజేయా లన్నారు. ఆర్ఆర్ఆర్ ప్రగతిపై రాష్ట్ర

-మిగతా 2 లో



## దేశంలో జనగణనకు రంగం సిద్ధం

**వచ్చే నెలలోనే ప్రారంభించే అవకాశం**

న్యూఢిల్లీ,

దేశంలో సుదీర్ఘ కాలంగా వాయిదా పడుతూ వస్తున్న జనాభా లెక్కల కార్యక్రమం ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం. పదేళ్లకు ఒకసారి చేపట్టే ఈ కార్యక్రమాన్ని 2021లోనే నిర్వహించాల్సి ఉంది. అయితే.. అప్పుడు కొవిడ్ వ్యాప్తి దృష్ట్యా వాయిదా పడింది. అప్పటి నుంచి పలు కారణాలతో జన గణన వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా వచ్చే నెల

-మిగతా 2 లో

## రుణమాఫీపేరుతో రైతులకు కుచ్చు టోపీ

**ప్రభుత్వ తీరుకు నిరసనగా నేడు మండల కేంద్రాల్లో ధర్నాలు**



**రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకం**


**ప్రభుత్వం అర్ధసత్యాలు, అసత్యాలను చెబుతోంది**

**మంత్రుల మాటల్లోనే పొంతన లేకుండా పోయింది బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు**

21,ఆగష్టు (చైతన్యగళం హైదరాబాద్,

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకమని.. రుణమాఫీ మొత్తం దగా, మోసమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్నవి అర్ధసత్యాలు, అసత్యాలన్నారు. రుణమాఫీపేరుతో రైతులకు కుచ్చు టోపీ అని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో

-మిగతా 2 లో



## కాశ్మీర్ ఎన్నికలపై బీజేపీ దృష్టి

**కిషన్‌రెడ్డి, రాంబాధవ్‌లకు ఎన్నికల బాధ్యతలు**

న్యూఢిల్లీ,

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్‌ను బీజేపీ అధిష్ఠానం జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో మూడు దశలు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

-మిగతా 2 లో




## బీజేపి సభ్యత్వ నమోదు ప్రారంభం

**ఉలాంఛనంగా ప్రారంభించిన కిషన్ రెడ్డి**

**ఉహామీలకు సిఎం రేవంత్ తూట్లు పొడిచారని విమర్శ**

21,ఆగష్టు (చైతన్యగళం హైదరాబాద్,

బీజేపీ సభ్యత్వ నమోదు ఉత్సవ్ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రారంభం అయ్యింది. ఇందులో భాగంగానే సికింద్రాబాద్ క్లాసిక్ గా÷–దర్గ÷న్స్ లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీమతి విజయ రహత్కర్ హాజరవగా.. అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ

-మిగతా 2 లో



## అక్రమ నిర్మాణాలు ఎవరివైనా కూల్చివేతలే

- కెటిఆర్ ఫామ్‌హౌజ్ కూల్చడం ఖాయం
- మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

21,ఆగష్టు (చైతన్యగళం హైదరాబాద్,

అక్రమ నిర్మాణాలు కెటిఆర్ లేదా ఇతర ప్రముఖులు కలిగి ఉన్నా కూల్చివేయడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ జన్వాడలో అక్రమంగా నిర్మించిన ఫామ్ హౌస్‌ను హైడ్రా అధికారులు కూల్చివేస్తారంటూ మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తన కారులో సెల్ఫ్ డ్రైవ్ చేసుకుంటూ కేటీఆర్ ఫామ్ హౌస్ చూసివచ్చినట్లు మంత్రి తెలిపారు. ఆ సమయంలో కేటీఆర్ భార్య అక్కడ పని చేయిస్తున్నారని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే హైడ్రా అధికారులు ఫామ్ హౌస్ తప్పకుండా

-మిగతా 2 లో



## హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నలు

**జన్వాడ ఫామ్‌హౌజ్ కూల్చివేతపై పిటిషన్**

హైదరాబాద్, జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధుల గురించి చెప్పాలని ఏపజీకి ఉన్నత న్యాయస్థానం సూచించింది.

-మిగతా 2 లో

## వేగంగా విస్తరిస్తున్న మంకీపాక్స్



**దేశంలో అముందస్తు చర్యలకు దిగిన కేంద్రం**

**కరోనా అంత ప్రమాదకారి కాదన్న ఆరోగ్య సంస్థ**

21,ఆగష్టు (చైతన్యగళం న్యూఢిల్లీ,

మంకీపాక్స్ వేగంగా వ్యాపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతోంది. పొరుగుదేశాల్లోనూ కేసులు నమోదవడంతో... కేంద్రం మరింత అప్రమత్తమైంది. దాయాది దేశం పాకిస్తాన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. అంతేకాదు.. పాక్ ఆక్రమిత కశ్మీర్ లోనూ ఒక ఎంపాక్స్ కేసు వెలుగుచూసింది. సౌదీ నుంచి పీఓకే కి వచ్చిన ఒక వ్యక్తిలో మంకీపాక్స్ లక్షణాలు కనిపించాయి. దీంతో.. కేంద్రం హైఅలర్ట్ ప్రకటించింది. ఎయిర్‌పోర్టులు, దేశ సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు చేపడుతోంది.

-మిగతా 2 లో

# పారదర్శకంగా.. వేగంగా భూసేకరణ

(మొదటి తరువాయి)

సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కలెక్టర్లు ఈ రహదారి విషయంలో రోజు వారీగా ఏం చేశారు..? ఏం పురోగతి సాధించారు..? దక్షిణ భాగంలో భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం,ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిరోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందజేయాలన్నారు. భూ సేకరణలోనూ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి, ఆమన్‌గల్, షాద్‌నగర్,చౌటుప్పల్



(189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, అదే సమయంలో పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అన్నారు. తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలి. సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి అనువుగా ఉండాలని, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు.

# ఆదానీకి దాసోహమన్న మోడీ ప్రభుత్వం

(మొదటి తరువాయి)

అన్ని కంపెనీలు ఆదాని పరమయ్యాయన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్‌పై ఆదానిపై కామెంట్ చేస్తే సీబీఐ రైడ్ చేసిందన్నారు. ఆదాని కంపెనీల్లో ఎస్‌బీఐ, ఎల్ఐసీ షేర్లు పెడుతున్నాయని... ఎవరి ప్రోద్బలంతో ఆదాని కంపెనీల్లో ఎస్‌బీఐ, ఎల్ఐసీషేర్లు పెడుతున్నదో ఎంక్వయిరీ చేయాలని డిమాండ్ చేశారు. మోడీ విదేశీ పర్యటనలో కూడా ఆదానిని తీసుకొని వెళ్లి కాంట్రాక్టులు ఇప్పిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. మోడీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేయాలని నిర్ణయించామన్నారు. ఆదాని, అంబానీలతో వ్యాపారాలకు మోడీ అండదండలు ఇస్తున్నారని...మాట వినని కార్పొరేట్ సంస్థలను ఈడి, ఐటీలతో రైడ్స్ చేయిస్తూ బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన జీవీకే గ్రూప్స్, కృష్ణపట్నం పోర్ట్ వాళ్ళని బెదిరించారన్నారు. మోడీ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈడీ కార్యాలయాల ఎదుట ఆందోళన చేస్తామని ప్రకటించారు. దేశంలోనే కాకుండా శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల్లో ఆదాని గ్రూప్స్‌కే కంపెనీ అనుమతులు ఇవ్వాలని మోడీ ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. దేశ సంపదను ఆదాని గ్రూప్స్ ద్వారా బయట దేశాలకు తరలిస్తున్నారన్నారు. మనీలాండరింగ్‌కి పాల్పడుతున్నారని మండిపడ్డారు. మోడీ, ఆదాని, సెబీ ఛైర్ పర్సన్ ముగ్గురు కలిపి దేశ సంపదను దోచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాని కోసం మోడీ, సెబీ ఛైర్ పర్సన్ పని చేస్తున్నారని.. దీని పరిష్కారం కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని.. అప్పుడే ఇందులో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కాంగ్రెస్ నేత వ్యాఖ్యలు చేశారు. 10 ఏళ్లుగా మోడీ రాజ్యాంగమైన సంస్థలను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. ఆయన ప్రాణమిత్రులకు మొత్తం దేశాన్ని కట్టబెట్టారన్నారు. ఆదానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. మోడీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచే అదానీతో సంబంధాలు ఉన్నాయన్నారు. ఆదాని వ్యాపార అభివృద్ధికి మోడీనే కారణమని... మోడీ అవినీతిపై ఎక్కడ మాట్లాడనివ్వరన్నారు. పార్లమెంట్‌లో మైకులు కట్ చేస్తున్నారని అన్నారు. మోడీ అవినీతిపై నేడు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మీడియా సమావేశాలు పెట్టామన్నారు. ప్రభుత్వ సంస్థలను అదానీ సంస్థల అభివృద్ధి కోసం వాడుకుంటున్నారని మధుయాష్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రుణమాఫీపేరుతో రైతులకు కుచ్చు టోపీ

(మొదటి తరువాయి)

ప్రభుత్వ తీరును ఎండగడుతూ..గురువారం అన్ని మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు ఉంటాయి. రేపటి ఆందోళనలు మొదటి అడుగు మాత్రమే. రైతులపై కేసులు ఉపసంహరించు కోవాలన్నారు. రుణమాఫీ చేయనందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకాలు చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఎప్పటిలోగా రుణమాఫీ పూర్తి చేస్తారో చెప్పాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. రుణమాఫీపై ఉత్తర కుమార ప్రగల్బాలు పలుకుతున్నారని.. రుణమాఫీపై రైతులకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ జరగక రైతులు రోడ్డెక్కుతున్నరు.. ఏ పత్రిక, ఛానల్ చూసినా ఇవే వార్తలు కనిపిస్తున్నాయి. ఆందోళన చేస్తున్న రైతులపై ఏడేళ్లు, రెండేళ్లు శిక్షలు పడే కేసులు పెడుతూ మరోవైపు అందరికి రుణమాఫీ అయిందని సీఎం సంబరాలు చేసుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం చెబుతున్నారు. రుణమాఫీపై మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారు. సాంకేతిక కారణాలతో మాఫీ కాలేదని మంత్రులు చెబుతున్నారు. భట్టి చెప్పిన లెక్కలు వింటే రుణమాఫీ వట్టిదేనని తేలిపోయింది. మాఫీ ఎట్లా ఎగ్గొడదామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తుందని.. అసలు రుణమాఫీపై ప్రభుత్వానికి స్పష్టత ఉందా..లేదా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. మాఫీ 30 శాతం, కాంగ్రెస్ మోసం 100 శాతమన్న ఆయన ఇది రైతు స్వరాజ్యం కాదు.. ఏడిపిస్తున్న రాజ్యమని ధ్వజమెత్తారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా బీఆర్ఎస్ ఉన్నంతకాలం రైతులకు అండగా ఉంటుందని, రైతులు స్థైర్యం కోల్పోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. చ్చి మోసగాళ్ల ప్రభుత్వం ఇదని.. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలున్నాయని చెప్పింది మీరా..కాదా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్.. ప్రభుత్వం రుణమాఫీ పేరుతో కేవలం రూ.7500 కోట్లతో సరిపెట్టాలని చూస్తున్నట్టుందన్నారు. లక్షల మంది రైతులను మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని ఏం చేయాలి..? సీఎం తడిగుడ్డతో రైతుల గొంతు కోసిండు. ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ బజారు భాష మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ను తిడితే సంబరపడే కొన్ని మీడియా సంస్థలున్నాయి. మొత్తం రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని కేటీఆర్ హెచ్చరించారు.

# అక్రమ నిర్మాణాలు ఎవరివైనా కూల్చివేతలే

(మొదటి తరువాయి)

కూలుస్తారని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఫామ్ హౌస్ ఉందని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. సీఎంకు అసలు ఫామ్ హౌస్ ఎక్కడుందని ప్రశ్నించారు. హైదరాబాద్ నగర పరిధిలో ఎక్కడ అక్రమ నిర్మాణాలు ఉన్నా హైడ్రా అధికారులు కూల్చివేస్తారని మంత్రి హెచ్చరించారు. సినిమా యాక్టర్ల బిల్డింగులు అక్రమంగా నిర్మించినట్లు తేలితే వాటిని కూడా వదిలే ప్రసక్తే లేదని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదన్నారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం కావడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఇకపై కేటీఆర్, హరీశ్‌ను బీజేపీ లీడర్లనే పిలవాలంటూ ఎద్దేవా చేశారు. ఢిల్లీలో ఏం జరుగుతుందో తనకు తెలుసంటూ మంత్రి చెప్పుకొచ్చారు. కేటీఆర్ ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలని కల్వకుంట్ల ఫ్యామిలీకి ఆయన హితవుపలికారు. కేటీఆర్ యువకుడని ఆయనకు ఏమైనా అయితే ఇబ్బంది అవుతుందని అన్నారు. ఆయణ్ని చూస్తేనే జాలి వేస్తోందంటూ మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పదేళ్లల్లో ఒక్కసారి కూడా అంబేద్కర్‌కి దండ వేయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ మళ్లీ తామే అధికారంలోకి వస్తామని చెప్పుంటే నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలందరూ కలిస్తేనే తెలంగాణ వచ్చిందని, కేసీఆర్ లాగా తాము దొంగ దీక్షలు చేయలేదని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. దేశం కోసం మాంసపు ముద్దయిన రాజీవ్ గాంధీ విగ్రహం సచివాలయం ఎదుట పెడితే తప్పేంటని ప్రశ్నించారు. విగ్రహం ఏర్పాటును బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. వాజ్ పేయి విగ్రహం పెడితే మంచిదేనని, మంచి స్థలం దొరికితే ఆయన విగ్రహాన్నీ పెడతామన్నారు. ఇక కేటీఆర్ తన జీవితంలో సర్పంచ్ కూడా కాలేరని విమర్శించారు. గురువారం రోజున బీఆర్ఎస్ నిర్వహించే ధర్నాకు కనీసం వెయ్యి మంది రారంటూ మంత్రి ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయ్యిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# దేశంలో జనగణనకు రంగం సిద్ధం

(మొదటి తరువాయి)

నుంచి దీన్ని చేపట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సెప్టెంబర్‌లో ప్రారంభమైతే.. కొత్త సర్వే పూర్తి కావడానికి దాదాపు 18 నెలలు పట్టే అవకాశమున్నట్లు పేర్కొన్నాయి. ప్రధాని కార్యాలయం నుంచి తుది ఆమోదం రావాల్సి ఉందని వెల్లడించాయి. జన గణనను చేపట్టే కేంద్ర హోంశాఖ, కేంద్ర గణాంకాల శాఖలు కాల పరిమితిని నిర్ణయించాయని.. 2026 మార్చి నాటికి 15 సంవత్సరాల డేటాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ అధికారులు తెలిపారు. అయితే.. దీనిపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, గణాంకాల శాఖ నుంచి ఎటువంటి ధ్రువీకరణ రాలేదు. జనగణన, జాతీయ జనాభా నమోదు ప్రక్రియ కోసం ఈసారి బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రూ.1,309.46 కోట్లను కేటాయించారు. మూడేళ్ల క్రితం నాటి కేటాయింపులతో పోలిస్తే ఈ మొత్తం తక్కువే. 2021-2022లో జన గణనకు రూ.3,768 కోట్లను ప్రతిపాదించినప్పటికీ ఆ దిశగా అడుగులు పడలేదు.

# కాశ్మీర్ ఎన్నికలపై బీజేపీ దృష్టి

(మొదటి తరువాయి)

సెప్టెంబర్ 18న తొలిదశ, 25న రెండోదశ, అక్టోబర్ ఒకటిన మూడో దశ ఎన్నికలు జరుగనుండగా.. అక్టోబర్ 4న ఫలితాలు వెల్లడవనున్నాయి. ఈ మేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ప్రకటన విడుదల చేశారు. జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలను ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించారని.. నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. మాధవ్ 2014-20 కాలంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. జమ్మూ కశ్మీర్, అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల రాజకీయ వ్యవహారాలను నిర్వహించే బాధ్యత ఆయనది. సెప్టెంబర్ 26, 2020న పునర్వ్యవస్థీకరణలో భాగంగా బీజేపీ ఆయనను ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించింది.

# హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నలు

(మొదటి తరువాయి)

ఈక్రమంలో హైడ్రా స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అని ఏఏజీ పేర్కొన్నారు. మరోవైపు హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నించింది. స్థల యజమానులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారని తెలిపింది. స్థానిక సంస్థల అనుమతితో నిర్మాణాలు జరుగుతాయని పేర్కొంది. 15-20 ఏళ్ల తర్వాత హైడ్రా వచ్చి అక్రమ నిర్మాణమంటూ కూల్చివేయడ మేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. మరోవైపు చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ఏర్పాటైందని ఏఏజీ తెలిపారు. ప్రదీప్‌రెడ్డి వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. జన్వాడలో ఉన్న ఫాంహౌస్ జీవో 111లోకి వస్తుందని పేర్కొన్నారు. జీవో 111 పరిధిలోని భూములు, ఫాంహౌజ్‌లు నీటిపారుదల శాఖ చూస్తోందని వివరించారు. వీటిని కూల్చివేసే హక్కు హైడ్రాకు లేదని ఏఏజీ తెలిపారు. కూల్చివేతల గురించి చర్చించాల్సి ఉందని హైకోర్టు తెలిపింది. విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది. జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. యజమాని ప్రదీప్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు, శంకర్‌పల్లి తహసీల్దార్, చీఫ్ ఇంజినీర్‌ను చేర్చారు. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో తన ఫాంహౌస్, పొలం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# వేగంగా విస్తరిస్తున్న మంకీపాక్స్

(మొదటి తరువాయి)

ఎంపాక్స్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఊరటనిచ్చే విషయం చెప్పింది. కోవిడ్‌లా... మంకీపాక్స్ ప్రమాదకర వైరస్ కాదని తెలిపింది. ఈ వైరస్ వ్యాపిని నియంత్రించే అవకాశాలు ఉన్నాయిని చెప్పింది. కోవిడ్ సమయంలో వ్యవహరించినట్టే.. ఎంపాక్స్ విషయంలోనూ అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని.. వైరస్ వ్యాప్తిని కట్టడి చేయగలిగితే.. ఎంపాక్స్‌ను కూడా తరిమేయొచ్చని చెప్పింది ప్రపంచ ఆరోగ్య సంస్థ. మంకీపాక్స్ లక్షణాలతో వచ్చే ప్రయాణికుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. దేశంలో ఎంపాక్స్ కేసులు బయటపడితే.. చికిత్స కోసం మూడు ఆస్పత్రులను నోడల్ వైద్య కేంద్రాలుగా ప్రకటించారు. వాటిలో ఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రి ఒకటి. రెండోది సఫ్దర్‌గంజ్ ఆస్పత్రి, మూడోది లేడీ హార్డింగ్ హాస్పిటల్. ఈ ఆస్పత్రుల్లో.. మంకీపాక్స్‌కు చికిత్స అందించనున్నారు. అందు కోసం ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రాల్లోనూ నోడల్ కేంద్రాలను గుర్తించి... ఎంపాక్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించింది. భారత్ దేశంలో గతంలో ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. అయితే... ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతున్న ఈ దశలో కొత్తగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గత ఏడాది జులై నాటికి.. దేశంలో 27 మంకీపాక్స్ కేసులు ఉన్నాయని... పార్లమెంట్‌లో నాటి కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సింగ్ బఘేల్ ప్రకటించారు. ఈ 24లో... 15 కేసులు ఢిల్లోలో... 12 కేసులు కేరళలో ఉన్నట్టు చెప్పారు.

# బీజేపి సభ్యత్వ నమోదు ప్రారంభం

(మొదటి తరువాయి)

సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒక్క గ్రామంలో కూడా పూర్తి రుణమాఫీ కాలేదని కిషన్ రెడ్డి ÷ర్ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై సైతం కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పద్ధతిలోనే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలకు సీఎం రేవంత్ రెడ్డి తూట్లు పొడుస్తున్నారన్నారు. రైతు రుణమాఫీని రేవంత్ రెడ్డి గందరగోళంగా మార్చారని కిషన్ రెడ్డి ÷ర్ అయ్యారు. దేవుళ్ళపై ఒట్లు వేసిన సీరేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో 50 శాతం రుణమాఫీ కూడా పూర్తి కాలేదని కిషన్ రెడ్డి తెలిపారు. రుణమాఫీపై పూర్తి వివరాలను ప్రజలు ముందు ప్రభుత్వం ఉంచాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రజా ఉద్యమాలకు సిద్ధం అవుతున్నామన్నారు. బీజేపీ.. వ్యక్తులు, కుటుంబాల కోసం నడిచే పార్టీ కాదని.. పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావటమే బీజేపీ లక్ష్యమన్నారు. బీజేపీ అధికారికంలోకి రావాలని ప్రజలే కోరుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ పై నిరసన సెగలు

**-జనాభా లెక్కలు తేల్చిన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేయాలని మాల ఐక్యవేదిక**
**-ఎస్సీ వర్గీకరణ పై తీవ్రమైన వ్యతిరేకత**



**వెల్దండ ఆగస్టు 21 (చైతన్య గళం):**
వెల్దండ మండల కేంద్రంలో మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఎస్సి సామాజిక వర్గాలను విడగొట్టి ఏ బి సి డి లుగా వర్గీకరణ ప్రకటన చేసినందున ఇందులో మాల ఉప కులాలకు అన్యాయం జరుగుతుందని, దీనిలో భాగంగా మాలల జనాభాను తేల్చిన తర్వాత జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని, మాలలం అందరం ఏ బి సి డి వర్గీకరణకు వ్యతిరేకం కాదు. కానీ ఇందులో జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ కల్పించాలని ఇందులో మాలలకు గాని, మాదిగల గాని ఎలాంటి అన్యాయం జరగకుండా అన్ని ఎస్సి ఉప కులాలను దృష్టిలో ఉంచుకొని ఎస్సీలలో మాదిగలలో ఎంత జనాభా ఉన్నది, మాలలో ఎంత జనాభా ఉన్నదని చూసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ఒక కమిటీ వేసి జనాభా లెక్కలు తేల్చిన తర్వాత దీనిపై పూర్తిగా ఎవరికి ఎంత శాతం రిజర్వేషన్ దక్కాలి అనే దానిపై చర్చించి దేశ అత్యున్నత న్యాయస్థానం పున పరిశీలన చేయాలని, ఈరోజు భారత్ బంద్ లో భాగంగా వెల్దండ మండల కేంద్రంలో మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో షాపులు మరియు విద్యాసంస్థలు బంద్ చేసి వెల్దండ మండల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడం జరిగింది . ఇట్టి కార్యక్రమంలో మండలంలో నీ అన్ని గ్రామాల మాలలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొనడం జరిగింది.

## బాధిత కుటుంబాలకు ఎల్ఎన్ రెడ్డి భరోసా



**కడ్తాల్ ఆగస్టు 21, (చైతన్య గళం):**
కడ్తాల్ గ్రామానికి చెందిన తల్లోజు బాల చారి అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం మరణించారు.విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్ గూడూరు నర్సింహ్మా రెడ్డి కడ్తాల్ గ్రామంలో బాల చారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి 5000/- రూపాయల ఆర్థిక సాయం అందించి కుటుంబానికి మనోధైర్యాన్ని నింపారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన గురిగళ్ళ పెంటయ్యను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం 5000/- రూపాయలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు నేనున్నానని, ప్రభుత్వం ద్వారా ఎల్ఓసి అందే విధంగా చర్యలు తీసుకుంటామని పెంటయ్యకు భరోసానిచ్చినట్లు తెలిపారు. పదవులు ఉన్న లేకున్నా ప్రజాసంక్షేమే తమ ధ్యేయమని, ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరునగరి వేణుగోపాల్, రైతు సమన్వయ సమితి గ్రామ కోఆర్డినేటర్ మంగల్ పల్లి నరసింహ,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్ అలీ, తల్లోజు యాదయ్య చారి, మాజీ వార్డు సభ్యులు గురిగళ్ళ జంగమ్మ రామచంద్రయ్య, తల్లోజు వేణు, ఇర్షాద్, కొప్పు కృష్ణ, మహేష్, శ్రీశైలం, శ్రీకాంత్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్ కాలనీలో వర్షాల కారణంగా రోడ్లు బురదమయంగా మారిన పరిస్థితి



**ఆమనగల్లు ఆగస్టు 21 (చైతన్య గళం):**
ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డు పరిధిలోని శాంతినగర్ కాలనీలో వర్షాల కారణంగా రోడ్లు బురదమయంగా మారాయి. ఇండ్ల మధ్య రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో పందులు చేరి తీవ్ర దుర్వాసన రేపుతున్నాయి. దోమలు విపరీతంగా పెరిగి కాలనీవాసులు అంటు వ్యాధుల భయంతో అల్లాడుతున్నారు. కాలనీవాసులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు రోడ్లపై ఏర్పడ్డ గోతుల్లో మొర్రం మట్టి తో చదును చేయాలని విన్నపించినా, పట్టించుకోవడం లేదు అని ప్రజల నుండి వేలకు వేల రూపాయలు పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ప్రజలకు వసతుల కల్పనలో విఫలమవుతున్నారు అని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.మున్సిపల్ సిబ్బంది మోరీల నుండి వెలికి తీసిన వ్యర్థాలతో కూడిన మట్టిని తెచ్చి రోడ్లపై చదును చేయడంతో, రహదారులు మరింత దుర్వాసన రేపుతూ బురదమయంగా మారాయి. ఇప్పటికైనా మున్సిపల్ కమీషనర్, పాలకవర్గం స్పందించి కాలనీలో ప్రజా ఇబ్బందులు తీర్చేలా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవచూపాలని శాంతినగర్ కాలనీవాసులు కోరుతున్నారు.

## భారత్ బంద్ నిర్వహించడం జరిగింది



**అచ్చంపేట ఆగస్ట్ 21 (చైతన్య గళం):**
ఈరోజు భారతదేశంలోని అన్ని దళిత సంఘాలు దళిత పార్టీలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి తీర్పుకు వ్యతిరేకంగా భారత్ బంద్ నిర్వహించడం జరిగింది అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేయడం జరిగింది నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి పాతుకుల శ్రీశైలం మాట్లాడుతూ ఆర్టికల్ 341 రాష్ట్రపతి, గవర్నర్ అందరూ తరపున అసెంబ్లీల తీర్మానాలు చేసి పార్లమెంట్లో చర్చ జరిగిన తర్వాతనే వర్గీకరణ పై మాట్లాడాల్సి ఉంటుంది కానీ నరేంద్ర మోడీ తన పదవి కాపాడు కోసం సుప్రీంకోర్టు న్యాయమూర్తులను తన ఇన్ ప్లేస్ ద్వారా వర్గీకరణను చేయించినట్టు స్పష్టంగా తెలుస్తున్నది ఏ1% తెలంగాణలో లేరు డి1% తెలంగాణలో లేరు బి గ్రూపు మాదిగకు 7ం2=9 % అవుతున్నది ఇది అన్యాయం కాదా నేటి రాజకీయా ఉద్యోగా, దళిత బందులో కానీ మాదిగలే ముందున్నారు రిజర్వేషన్స్ 25% కి పెంచాల్సిన అవసరం ఉంథి.మాల మాదిగలిద్దరూ వివక్షతనుసమాజంలో ఎదుర్కొంటున్నారు ఎస్టీ ల తో చర్చించి కార్యాచరణ రూపొందిస్తాం, పాల్గొన్నవారు పి శ్యాంసుందర్ జెవెంకటేష కిన్నెర పాండు బి ఆనంద్ రాజేష్ పిల్లి వెంకటస్వామి రఘుపతి గణేష్ పర్వతాలు సైదులు మల్లయ్య స్వామి

## ఐఎన్టీయూసీ ఫెడరేషన్ జాతీయ మహాసభలు విజయవంతం



**న్యూఢిల్లీ ఆగస్ట్ 21 (చైతన్య గళం):**
న్యూఢిల్లీలో జరిగిన ఐఎన్టీయూసీ ఫెడరేషన్ జాతీయ మహాసభలకు పురస్కరించుకొని నేషనల్ ప్రెసిడెంట్ స్వామినాథ్ జైస్వాల్ మరియు తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్.మురహరి బుద్ధారం మాట్లాడుతూ కార్మికుల సమస్యల గురించి ప్రస్తావించారు. చిన్న చూపు చూస్తున్న ప్రైవేటు కంపెనీలపై ఉక్కుపాదం మోపాలని, ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉండే విధంగా ఐఎన్టీయూసీ ముందుంటుందని వారు తెలిపారు. జాతీయ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న మహాసభలకు అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఐఎన్టీయూసీ ఇండియన్ నేషనల్ ట్రేడ్స్ యూనియన్ కాంగ్రెస్ ఫెడరేషన్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని Dr. మురహరి బుద్ధారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్ పాల్గొన్నారు.

## అధికారులతో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమావేశం



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 21 (చైతన్య గళం):**
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజా భవన్) లో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు . వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పనులు పురోగతి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటామాని అన్నారు. అలాగే , అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో ఆర్డీఓ అనంత రెడ్డి, ఏసీపీ రాజు, పంచాయతీ రాజ్ EE శ్రీనివాస్ రెడ్డి,వివిధ మున్సిపాలిటీ ల కమీషనర్ లు, ఎమ్మార్వో లు ఇరిగేషన్, రెవిన్యూ,పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.



ఆట విడుపుగా స్నూకర్ ఆడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

## బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎర్రోళ్ల రాఘువేందర్




**కడ్తాల్ ఆగస్టు 21 (చైతన్య గళం):**
హైద్రాబాద్ లో బి సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు mp ఆర్ కృష్ణయ్య మాట్లాడు నిరంతరం ప్రజా ఉద్యమాలు చేస్తున్న తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు ఎర్రోళ్ల రాఘువేందర్ ను, బి సి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రము అందజేశారు. నియమించడానికి సహకరించిన గుజ్జ కృష్ణ, నంద గోపాల్, ఉదయ్ కుమార్ నేత, నీలం వెంకటేష్ , వేముల రామకృష్ణ, గౌరిగ మల్లేష్, సుధాకర్ ,రాజ్ కుమార్, సహకరించిన నాయకులందరికీ ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు సమాజంలో జరుగుతున్న అణగారిన వర్గాల హక్కుల సాధనకై కృష్ణన్న నాయకత్వంలో పోరాటాలు చేయడానికి సిద్దం అని ఎర్రోళ్ల రాఘువేందర్ తెలియజేశారు

## మృతురాలి కుటుంబానికి మాజీ మంత్రి ఆర్థిక సహాయం



**వనపర్తి ఆగస్టు 21 (చైతన్య గళం):**
కొత్త సుగూర్ గ్రామ మాజీ అధ్యక్షులు ముంత రాజు భార్య సువర్ణ విద్యుత్తు షాక్ వల్ల ప్రమాదాన్నికి గురై మరణించింది.విషయం తెలుసుకున్న మంత్రి నిరంజన్ రెడ్డి సువర్ణ మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ అంత్యక్రియల నిమిత్తం రూ.5000 వేలు ఆర్థిక సహాయం సర్పంచ్ జూదం వెంకటేష్ ద్వారా అందజేశారు.ముంత.రాజును జిల్లా పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్,మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమములో రమేష్,హనుమన్న,వెంకటయ్య, తిరుమలేశు తదితరులు ఉన్నారు.

# మౌలిక వసతులను కల్పనను కృషిచేస్తా

**-ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ ఆగష్టు 21 (చేతన్య గళం):**
ఈరోజు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బాచుపల్లి కి చెందిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు దాదాపు యాభై మంది ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ని కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద నెలకొని ఉన్న భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం, ప్రహరీ గోడ నిర్మాణం, కరెంటు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు మౌలిక వసతులైన భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం, కరెంటు వసతులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నదీమ్ రాయ్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు అశోక్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 21 (చైతన్య గళం):**
యాచారం మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఇటీవల కురిసిన వర్షానికి వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వర్షం నీరంతా అక్కడికి చేరి నిలిచి పోయింది... పట్టించుకోని స్పెషల్ అపిసర్లు అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి అంజయ్య అన్నారు. మరియు సాయినగర్ కాలని ప్రసిడెంట్ శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ వర్షం తో రోడ్లు బురద మయంగా కావడంతో సామాన్య ప్రజలు స్కూలుకు పోవు విద్యార్థులు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు . అధికారులు వెంటనే చొరవ తీసుకుని వర్షం నీరు రోడ్డుపై నిలవకుండా చర్యల తీసుకోవాలన్నారు. రోడ్లమీద నీరు చేరడంతో మురికి ఎక్కువై ఈగలు దోమలు చేరి జ్వరాలు వస్తున్న పరిస్థితి వుంది కావున ప్రభుత్వం గ్రామపంచాయతీ లకు నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు . లేని పక్షంలో ఆందోళనకు పునుకుంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చారి ప్రమీల తదితరులు ఉన్నారు.

# యోగా మహా సంగ్రామ్ 2024లో మెరిసిన కుత్బుల్లాపూర్ చిన్నారులు



**కుత్బుల్లాపూర్ ఆగష్టు21(చేతన్య గళం):**
కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద ఎస్.ఎస్.డి యోగా స్టూడియో గురువు మల్లేష్, యోగా బ్రదర్స్ పూర్ణ, విజయ్ లు గతనెల 27, 28 లలో యోగసన ఫెడరేషన్ ఆఫ్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా మహా సంగ్రామ్ 2024 లో పతకాలు సాధించిన విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యోగా మహాసంగ్రామ్ లో ఐదు బంగారు పతకాలు, నాలుగు రజత పతకాలు , రెండు సిల్వర్ పతకాలతో సత్తా చాటిన కుత్బుల్లాపూర్ కు చెందిన యోగ విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా తమ శిక్షణతో పిల్లలను యోగాలో నిష్ణాతుడిగా తయారు చేస్తున్న ఎస్.ఎస్.డి. యోగ స్టూడియో కోచ్ విజయ్ కుమార్ ను "బెస్ట్ కోచ్" గా నిలిచారు. అనంతరం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ పిల్లలు మానసికంగా దృఢత్వం పొందుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో యోగ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో యోగా శిక్షణ పొందుతున్న పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రతిపాదికన ఉపాధి యూనిట్లను కేటాయించండి

**-బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే**

**-కమ్యూనిటీ ఆర్గనైజర్ లతో సమావేశం**



**వరంగల్ జిల్లా బ్యూరో ఆగస్టు 21 (చైతన్య గళం):**
స్వయం సహాయక మహిళ బృందాలకు యుద్ధ ప్రతిపాదికన ఉపాధి యూనిట్లను కేటాయించాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లతో (సి ఓ) ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ల ఏర్పాటు సంబంధిత అంశాల పై ఏర్పాటు చెందిన సమీక్షా సమావేశానికి కమిషనర్ హాజరై సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ బల్దియా వ్యాప్తం గా ఇప్పటివరకు గ్రౌండింగ్ ఐన యూనిట్ ల పురోగతిని సివోల వారిగా అడిగి తెలుసుకొన్న అనంతరం మాట్లాడుతూ ప్రతి సి ఓ వారంలోగా కనీసం 10 యూనిట్లను ఏర్పాటు లక్ష్యం గా పని చేయాలని ఎస్ ఎస్ జి బృందాలకు బ్యాంకు లింకేజీ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సి ఓ లు సహకరించాలని ఏర్పాటు చేసే యూనిట్లలో ప్రధానంగా క్యాంటీన్లు ఫుడ్ ప్రాసెసింగ్ క్యాటరింగ్ గృహ సేవిక నిర్మాణ రంగ సేవలు వంటి వాటికి ప్రాధాన్యం కల్పించాలని ఏర్పాటు చేసే ప్రతి యూనిట్ కి బ్రాండింగ్ ఇవ్వడంతో పాటు క్యాంటీన్లలో తయారయ్యే ఆహార పదార్థాలను మిగితా ఆహార పదార్థాల మాదిరిగా కోరుకున్న చోటికి అందించేలా స్విగ్గి వారి సహకారం తీసుకొని వ్యాపారాన్ని వృద్ధి చేసుకునేలా చూడాలని ఎంబ్రాయిడరీ యూనిట్ లు ఎంచుకున్న బృందాలకు అమోజన్ ద్వారా కొనుగోలు చేసేలా సహకరించాలని ఈ సందర్భం గా కమీషనర్ అన్నారు.ఇట్టి కార్యక్రమంలో టిపిఆర్ఓ కోలా రాజేష్ కుమార్ గౌడ్ టి ఎం సి రమేష్ కమ్యూనిటీ ఆర్గనైజర్లు సకినాల రమేష్ శ్రీలత రాజ్ కుమార్ స్వాతి సునీల్ రజిత అలీ తదితరులు పాల్గొన్నారు.

# ఆంక్షలు లేకుండా రైతులందరికీ ఋణ మాఫీ చేయాలి

**-రైతులకు మద్దతుగా చేసే ధర్నా విజయవంతం చేయాలని బి.ఆర్.ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి పిలుపు**



**వనపర్తి ఆగస్టు 21 (చైతన్య గళం):**
రైతు ఋణ మాఫీ రైతులందరికీ చేయాలని నేడు ఆర్.డి.ఓ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాను రైతులతో కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40శాతం మంది రైతన్నలకు కూడా రుణమాఫీ కాలేదు అని సి.ఎం.రుణ మాఫీ పూర్తయిందని చెబుతుంటే మంత్రులు మనిషికో మాట చెబుతూ రైతులను అయోమయానికి గురిచేస్తున్నారు అనేక ఆంక్షలు పెట్టి రైతన్నలను మోసం చేసినందుకు రాష్ట్రప్రభుత్వం రైతులకు క్షమాపణలు చెప్పాలి అని అన్నారు.అందరికీ వెంటనే రుణ మాఫీ చేయాలని అప్పటిదాక ప్రభుత్వంపై పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.రెండు లక్షల వరకు అందరికీ రుణ మాఫీ అయిందని ముఖ్యమంత్రి చెబుతుంటే ....మంత్రులు మాత్రం ఇంకా రుణ మాఫీ కార్యక్రమం కొనసాగుతుంది అని చెబుతున్నారని అన్నారు.ఎన్నికల ముందు రుణ మాఫీ అందరికీ వర్తింపజేస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసిందని గుర్తుచేశారు.ఎన్నికలు కాగానే రుణ మాఫీ కోసం రూ. 40వేల కోట్లు అవసరమని సి.ఎం చెప్పారని కానీ క్యాబినెట్ మాత్రం కేవలం రూ. 31 వేల కోట్లకు మాత్రమే అనుమతి ఇచ్చింది అన్నారు. బడ్జెట్లో 26 వేల కోట్లు కేటాయించి కేవలం 18వేల కోట్లు ఖర్చు చేసిందని ఆరోపించారు.రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని కాబట్టి ధర్నా ద్వారా ప్రభుత్వం కళ్ళు తెరిపించాలని అన్నారు.ఈ సమావేశంలో బి.లక్ష్మయ్య,గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్,విజయ్ కుమార్, రఘువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కానీ రైతుల పక్షాన బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

**-బిఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్**



**వనపర్తి ఆగస్ట్ 21 (చైతన్య గళం):**
వనపర్తి జిల్లా కేంద్రంలో నేడు రుణమాఫీ కానీ రైతుల పక్షాన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం ఉంటుందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ తెలిపారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని మోసపూరిత మాటలు చెప్పిన కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా జిలా BRS పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి ఆర్డీఓ కార్యాలయం దగ్గర ధర్నా కార్యక్రమం ఉంటుందని శ్రీధర్ అన్నారు.

# రోడ్డు కి మరమ్మతులు



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 21 (చైతన్య గళం**
వినాయక్ నగర్ నుండి షాపూర్ వెళ్లేదారిలో రోడ్డు గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడటంతో పగలనకా రాత్రనక నిరంతరం ప్రజాసేవలో ఉండే నదీమ్ రాయి గారు గుంతలు పడ్డ రోడ్డును మరియు ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి సంబంధిత సిబ్బందిని పంపించి మరమ్మత్తులు చేయించడం జరిగింది. ఈ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కేపీ.వివేకానందలిమరియు లిబిఆర్ఎస్ సీనియర్ నాయకులు నదీం రాయ్

# వారివి వెర్రి కూతలు,మావి అభివృద్ధి బాటలు






**-రైతు రుణమాఫీ సహా ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం**

**-టీ ఎస్ పీఎస్సీ ని ప్రక్షాళన చేశాం**

**-జాబ్ కేలెండర్ తో నిరుద్యోగులకు అండగా నిలుస్తాం**

**-రైట్ ఛాయిస్- శీనన్న ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి**

**-మంత్రి పొంగులేటి సేవాభావం అభినందనీయం: ఎంపీ రఘురాం రెడ్డి**

**ఖమ్మం జిల్లా ఆగస్ట్ 21 (చైతన్య గళం):**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రధాన ప్రతిపక్షం, దానికి తోడైన మరో విపక్షం వెర్రి కూతలు కూస్తున్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. బుధవారం రైట్ ఛాయిస్ ఆధ్వర్యంలో రామ్ లీలా ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన పొంగులేటి శీనన్న ఉచిత కోచింగ్ క్యాంపును ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాదిగా హాజరైన నిరుద్యోగ అభ్యర్థులను, పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రజలు మార్పు కోరుకుని రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యానికి పట్టం కట్టారని, వారి నమ్మకాన్ని వమ్ము చేసుకోమని తెలిపారు. మేం అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 31వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. 45 రోజుల్లోనే టీఎస్ పీఎస్సీని ప్రక్షాళన చేశామని, పేపర్ లీకేజీలు లేకుండా నిరుద్యోగుల నమ్మకాన్ని పొందామని అన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని రూ.31వేల కోట్లతో అమలు చేస్తున్నామని తెలిపారు.నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధి మాకే ఉంది ఈ ప్రభుత్వానికి పేదలు, నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధి ఉందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పోటీ పరీక్షలను రద్దు చేయించి నిరుద్యోగులను రెచ్చగొట్టాలని బీఆర్ఎస్ వారు, వారి తొత్తు పార్టీ చూస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల కోసమే పనిచేస్తుందని అన్నారు. జిల్లాలో త్వరలోనే స్కిల్ డెవలప్మెంట్ బ్రాంచ్ ఏర్పాటు చేయిస్తా నిరుద్యోగుల భవితవ్యానికి భరోసా కల్పించేలా హైదరాబాద్ లో ప్రతిష్టాత్మకంగా స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ను ప్రారంభించుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు మరో వంద మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతారని అన్నారు. త్వరలోనే జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ బ్రాంచ్ ను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. నిరుద్యోగులను తీర్చిదిద్దడంలో మెండెం కిరణ్ మేటి 2016 నుంచి రైట్ చాయిస్ అధినేత మెండెం కిరణ్ తనకు తెలుసని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గతంలో నిరుద్యోగుల కోసం పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్ను పెట్టగా కిరణ్ పర్యవేక్షణలో 300 మందికి ఉద్యోగాలు వచ్చేలా తీర్చిదిద్దారని కొనియాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం తిరిగి గ్రూప్ పరీక్షలు, ఎస్సై, కానిస్టేబుల్ పోటీ పరీక్షల కోసం ఉచితంగా శిక్షణ నిర్వహించబోతుండడం ఆనందంగా ఉందని తెలిపారు. అందరూ కష్టపడి చదివి, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని, ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు నుంచి పేరు తీసుకురావాలని కోరారు. మంత్రి పొంగులేటి సేవాభావం గ్రేట్: ఎంపీ రఘురాం రెడ్డి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిరంతరం ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతుంటారని, అందరి బాగోగులు తెలుసుకుంటూ ప్రజా సేవ చేస్తారని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. రాజకీయాల్లో ఇలాంటి వ్యక్తి ఉండడం అరుదని కొనియాడారు. తన విజయంలో పాత్ర కీలకమని గుర్తు చేశారు. ఓ ఎంపీగా జిల్లాలోని నిరుద్యోగుల బాగుకు తప్పకుండా సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, తుళ్లూరి బ్రహ్మయ్య, ప్రొఫెసర్ చింతా గణేష్, జ్యోతి రెడ్డి, కాంగ్రెస్ ఖమ్మం రూరల్ మండలాధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు మద్ది మల్లారెడ్డి, కిశోర్ రెడ్డి, అజ్మీరా అశోక్ నాయక్, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, భద్రకాళి, హారికా నాయుడు తదితరులు పాల్గొన్నారు.